www.kalamjyothi.com
# కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం
15.09.2026







# 25 వేల ఇళ్లకు విముక్తి!

## వీడనున్న 22ఏ ఉచ్చు

- త్వరలో కీలక ప్రకటన చేయనున్న సీఎం
- విధివిధానాల ఖరారుకు కసరత్తు
- ప్రతిపక్షాల దుష్ప్రచారానికి చెక్

4 లో





# పంచముఖ సంకటహర మహాగణపతిగా

# ఖైరతాబాద్ బడా గణేష్

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతుల చేతుల మీదుగా వైభవంగా తొలిపూజ
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- 69 అడుగుల భారీ విగ్రహ రూపకల్పనలో 150 మంది కళాకారుల ప్రతిభ
- గణపయ్య దర్శనానికి బారులుదీరిన భక్త జనం



3 లో



# నిమజ్జనమే లేని పాలజ్ వినాయకుడు

- భక్తుల కోర్కెలు ఈడేర్చే ఇలవేల్పు
- 79 ఏళ్లుగా పూజలు
- వరాలిచ్చే వేల్పుగా ప్రతీతి

**కలం జ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 14) :** ఆది దేవునిగా పూజలందుకుంటున్న వినాయకునికి ప్రతి ఏటా నవరాత్రులు నిర్వహించి నిమజ్జనం చేయటం ఆనవాయితీ. అయితే నిర్మల్ జిల్లా సరిహద్దుల్లోని మహారాష్ట్ర గ్రామం పాలజ్ లోని కర్ర వినాయకునికి మాత్రం నిమజ్జనం అనేదే లేదు. అలాగే ఇక్కడ వినాయకునికి మొక్కుకుంటే అది తప్పనిసరిగా జరిగి తీరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా కుభీరు మండలం నిగ్వా గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో నాందేడ్ జిల్లా పాలజ్ గ్రామంలో ఈ స్వామి కొలువై ఉన్నాడు. ఇక్కడ ఈ వినాయకుని ప్రతిష్ఠాపన వెనుక ఒక ఘటన ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ ప్రాంతంలో కలరా, ప్లేగు వంటి మహమ్మారులు ప్రబలి ప్రజలు మరణించే వారని చెబుతారు. ఒకే ఏడాది దాదాపు 30 మంది ఇలా మరణించారు. ఈ పరిస్థితి భవిష్యత్తులో రాకుండా ఉండేందుకు గ్రామస్తులు కొందరు వినాయకుని విగ్రహ ప్రతిష్ఠాపన కు ముందుకొచ్చారు. 1948 సంవత్సరంలో నిర్మల్ పట్టణానికి చెందిన నకాషి విగ్రహ రూపకర్త పోలకొండ గుండాజీ వర్మ ను పిలిపించారు. కర్ర వినాయకుని విగ్రహాన్ని తయారు చేయించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం అంతకు ముందున్న కలరా, ప్లేగు వ్యాధులు పూర్తిగా నయం కావటంతో స్వామిపై విశ్వాసం పెరిగింది. ఈ విశ్వాసంతో ఏయేటి కాయేడు భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రుల్లో తప్ప మిగిలిన రోజుల్లో స్వామివారి దర్శనం ఉండదు. వినాయక చవితి రోజు ప్రతిష్ఠాపన జరుగుతుంది. పదకొండు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం రోజున నదీ జలాలు తెచ్చి స్వామివారిపై చల్లుతారు. దీంతో నిమజ్జనం పూర్తయినట్లు భావిస్తారు. మరుసటి ఏడాది వరకు విగ్రహాన్ని ఒక గదిలో భద్రపరుస్తారు. మళ్లీ ఏడాది వరకు స్వామివారి దర్శనం ఉండదన్న ఉద్దేశ్యంతో ఈ పదకొండు రోజుల పాటు వివిధ పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది.

### చేరాలంటే ఇదీ మార్గం..

నిర్మల్ జిల్లా భైంసా నుంచి 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి ప్రైవేట్ వాహనాలు, బస్సుల సౌకర్యం ఉంది. నిజామాబాద్ మీదుగా కూడా భైంసా వరకు ప్రభుత్వ రవాణా సౌకర్యాలు వినియోగించుకుని రావచ్చు. కోరిన కోరికలు తీర్చే ఈ స్వామికి భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ రావటంతో రవాణా సౌకర్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉంది.

### నిర్వహణ గ్రామస్తులదే..

ప్రతి సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలను గ్రామస్తులే సమిష్టిగా నిర్వహిస్తారు. ఉత్సవాల నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయంతో భక్తులకు వసతులు కల్పిస్తారు. భక్తుల కోసం సత్రాలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన నీటి సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తులందరికీ 11 రోజులపాటు ఉచిత అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు.

## ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో.. వినాయక చవితి ఉత్సవాలు

**కలంజ్యోతి, నిర్మల్:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ డా. జి. జానకి షర్మిల వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



## కర్ర వినాయకునికి అల్లోల తొలిపూజ

**కలం జ్యోతి, నిర్మల్:** నిర్మల్ పట్టణంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన కర్ర వినాయకుని పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొని తొలి పూజ నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. వీరితో పాటు మేడారం అపర్ణ ప్రదీప్, పీవీ రమణ రెడ్డి, నిర్మల్ పట్టణ విశ్వబ్రాహ్మణ కర్ర పారిశ్రమిక సంఘ అధ్యక్షులు కె. నారాయణ చారి, గౌరవ అధ్యక్షులు రాజ లింగం, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ చారి, గంగా ప్రసాద్ చారి, విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటగిరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ముప్పిడి రాకేష్, సంఘ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## కొలువుదీరిన గణనాథుడు
### పర్యావరణ హితంగా మట్టి ప్రతిమలు

**కలంజ్యోతి, నిర్మల్ :** విఘ్నాలకు అధిపతి గణనాథుని నవరాత్రి వేడుకలు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభ మయ్యాయి. గత రెండు రోజులుగా నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వినాయక విగ్రహాలను తీసుకెళుతున్న వాహనాలతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. గతం కంటే భిన్నంగా ఈసారి గణనాథుల ప్రతిష్టాపనలో పర్యావరణ పరిరక్షణ కూడా నడుం బిగించారు. వివిధ కాలనీలతోపాటు పలు అపార్ట్మెంట్లలో కూడా వినాయకుని ప్రతిష్టించారు. కాగా తన్వి అపార్ట్మెంట్లో ప్రతిష్టించిన వినాయకుని ప్రతిమను తహసిల్దార్ సత్యనారాయణరావు అందజేశారు. అలాగే దివ్య అపార్ట్మెంట్లో మట్టి వినాయకుని ప్రతిమను ప్రతిష్టించి తమకున్న పర్యావరణ పరిరక్షణ భావాన్ని చాటుకున్నారు. ఇదిలా ఉంటే భారీ ఎత్తున ఉన్న విగ్రహాలను తరలించడంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. విద్యుత్ వైర్లు తగలకుండా ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. అలాగే పలు రెసిడెన్షియల్ పాఠశాలలో కళాశాలలో విద్యార్థుల కోసం వినాయక విగ్రహాలను యాజమాన్యాలు ప్రతిష్టించాయి. ఇదిలా ఉండగా గతం కంటే భిన్నంగా ఈ సారి అధికంగా వినాయకుని ప్రతిష్టించటం విశేషం. వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో ప్రతిష్టించిన కర్ర వినాయకునికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దివ్య రెసిడెన్సీ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, తన్వి అధ్యక్ష కార్యదర్శులు భానుమూర్తి, ప్రవీణ్, కోశాధికారి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.









## పంచముఖ సంకటహర మహాగణపతిగా

# ఖైరతాబాద్ బడా గణేష్

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 14) :** నగరంలోని ఖైరతాబాద్‌లో వినాయక చవితి వేడుకలు సోమవారం నాడు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. 69 అడుగుల భారీ ఎత్తులో కొలువుదీరిన 'శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి' విగ్రహానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు శాస్త్రోక్తంగా తొలి పూజ నిర్వహించారు. అంతకుముందు గవర్నర్ దంపతులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి విగ్రహం వద్దకు తీసుకెళ్లారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గవర్నర్ దంపతులు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ వినాయకుడికి తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే పద్మశాలి సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేసిన భారీ కండువా, యజ్ఞోపవీతాన్ని సమర్పించారు. తొలిరోజు నుంచే బడా గణేశుడి దర్శనం కోసం భాగ్యనగరంతో పాటు నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తుండటంతో ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలు భక్తిపరవశంతో కోలాహలంగా మారాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రభుత్వం ఆదేశాలతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఈ ఏడాది ఖైరతాబాద్ గణేష్ 69 అడుగుల భారీ ఎత్తులో 'శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి'గా భక్తులకు దర్శనమిస్తున్నారు. వినాయకుడి విగ్రహానికి కుడి వైపున 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, ఎడమ వైపున కాళికా మాత విగ్రహాలను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ మహాగణపతిని పూర్తిగా పర్యావరణహితంగా మట్టి, జనపనార, గడ్డి, కర్రలు, సహజ రంగులతో రూపొందించారు. ప్రధాన శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది నిపుణులైన కళాకారులు దాదాపు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని తీర్చిదిద్దారు.



## నవయుగ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి ఉత్సవాలు

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 14) :** చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామంలో నవయుగ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో నవయుగ యూత్ సభ్యులు పులిశేరు రాజేందర్, పెండ్యాల రమేష్, కరెడ్ల శివ, ఒంటరి అశోక్, రాజు, పడిదం అనిల్, పెండ్యాల యాకయ్య, పడిదం రాకేష్, పెండ్యాల నగేష్, సునీల్, హరికృష్ణ, ఉషిల్ల రాజు, అనూష, రవళిక, రజిని, అనూష, త్రిలోక్య, మహిళలు పెండ్యాల జ్యోతి, రజిత, లక్ష్మి, పడిదం రాధ, కరుణశ్రీ, గీత, స్వరూప గ్రామ పెద్దలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## సదులనగర్‌లో వినాయకుడికి.. ప్రత్యేక పూజలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని సాదులనగర్ గ్రామంలో పలు వార్డులలో వినాయక మండపాల వద్ద భక్తులు విగ్నేశ్వరులు భక్తిశ్రద్ధలతో వేద పండితుల వారిచే గణనాథుని ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ విగ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఘ్నేశ్వరుని భక్తులు పాల్గొన్నారు.






# 25 వేల ఇళ్లకు విముక్తి!


## వీడనున్న 22ఏ సెక్షన్ ఉచ్చు

- త్వరలో కీలక ప్రకటన చేయనున్న సీఎం
- విధివిధానాల ఖరారుకు కసరత్తు
- ప్రతిపక్షాల దుష్ప్రచారానికి చెక్

**కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 14) :** నిషేధిత భూముల 22ఏ జాబితాలో చిక్కుకున్న వేలాది ఇళ్లకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత బీఆర్ఎస్ హయాంతో పాటు అంతకంటే ముందే దాదాపు 25 వేల ఇళ్లు నిషేధిత జాబితాలోకి చేరినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అసెంబ్లీలో స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై దీనిపై సమగ్ర విధాన నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ఇళ్ల యజమానులకు పూర్తి ఉపశమనం కల్పిస్తూ అసెంబ్లీ వేదికగానే ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది.

**ప్రతిపక్షాల దుష్ప్రచారానికి చెక్..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే పేదల ఇళ్లు నిషేధిత జాబితాలోకి ఎక్కాయంటూ బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి ప్రభుత్వం దీటుగా బదులిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని కాలనీల వివరాలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం బయటపెట్టింది. హరీశ్‌రావు పర్యటించిన కాలనీల్లోని ఇళ్లు గత ప్రభుత్వాల హయాం నుంచే 22ఏ జాబితాలో ఉన్నాయని, రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు.



**క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రత..**

రాష్ట్రంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధానంగా ఈ సమస్య నెలకొంది. మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో 10,395 ఇళ్లతో పాటు యూఎల్‌సీ సమస్యలతో మరో 4,530 ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్నాయి. పటాన్‌చెరు పరిధిలో 2,117 ఇళ్లు ఉండగా, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో దాదాపు 5,080 ఇళ్లు పీఓబీ రికార్డుల్లో చిక్కుకున్నాయి. మొత్తం 22,122 కుటుంబాల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది.

**నియోజకవర్గాల వారీగా వివరాలు..**

మేడ్చల్‌లో అత్యధికంగా 6,198 ఇళ్లు, కుత్బుల్లాపూర్‌లో 5,773, శేరిలింగంపల్లిలో 4,826, ఉప్పల్‌లో 3,583 ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో 2,117 ఇళ్లు, మహేశ్వరంలో 173, రాజేంద్రనగర్‌లో 81 ఇళ్లు ఈ రికార్డుల్లో నమోదయ్యాయి. బీహెచ్ఈఎల్ కాలనీ, అయ్యప్ప కాలనీ, పద్మానగర్, దేవేంద్రనగర్, సుభాష్‌నగర్, బీజేఆర్ నగర్ వంటి అనేక ప్రధాన నివాస ప్రాంతాలు ఏళ్ల తరబడి నిషేధిత జాబితాలోనే కొనసాగుతున్నాయి.

**విధివిధానాల ఖరారుకు కసరత్తు..**

బాధితులకు ఏకకాలంలో ఊరట కల్పించేందుకు అవసరమైన మార్గదర్శకాల రూపకల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. దరఖాస్తుల స్వీకరణ విధానం, యజమానులు సమర్పించాల్సిన పత్రాలు, క్షేత్రస్థాయి విచారణ వంటి నిబంధనలను త్వరలోనే ఖరారు చేయనున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను ప్రజల ముందు ఉంచుతూనే, చట్టబద్ధమైన హక్కులు కల్పించి నివాసితులకు శాశ్వత సాంత్వన చేకూర్చాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది.



ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగాధర క్షేత్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను, విశేష ద్రవ్యాలచే అభిషేకాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, ప్రముఖ పురోహితులు మూగు నాగరాజు శర్మ, నర్సయ్య పంతులు, భక్తులు పాల్గొన్నారు.

కలంజ్యోతి, ఇల్లంతకుంట







**కలంజ్యోతి, చెన్నారావుపేట :**

చెన్నారావుపేట మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి గల్లీలోనూ నిర్వాహకులు రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించి గణనాథులను ప్రతిష్టించారు. ఉదయం నుంచే భక్తులు కొత్త బట్టలు ధరించి స్థానిక దేవాలయాలకు, మండపాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగడంతో అనేక ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించడం విశేషం. సాయంత్రం వేళ వర్షం కురిసినప్పటికీ, భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. శాంతిభద్రతల పరిరక్షణకై స్థానిక పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.



# వైభవంగా గణపయ్య నవరాత్రోత్సవాలు









కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 15.09.2026
www.kalamjyothi.com

Cinima

# ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. నిర్మాత నమిత్ మల్హోత్రా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం సీతా-రాముల ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసింది. రణబీర్, సాయి పల్లవిల దివ్య రూపం వెండితెరపై మైమరిపించేలా ఉండటంతో, ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.




Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Sri Sai Printers and Graphics H.no.52/52_65, Venkateswara Nagar, Hanumakonda Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.